సాక్షి
సూర్యాపేట
గురువారం ¦ 2 ¦ ఫిబ్రవరి ¦ 2023



వైభవంగా దోపోత్సవం
చెర్వుగట్టు లో బుధవారం తెల్లవారు జామున దోపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.
- 18లో



ధ్వజారోహణం.. దేవతాహ్వానం
పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం విశేష పర్వాలు జరిగాయి.
- 18లో

గరిష్ఠం/కనిష్ఠం
33°/17°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నూరుశాతం ఇంటి పన్ను వసూలు చేయాలి

మునగాల: ఈనెల 20వ తేదీ కల్లా మండలంలోని ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో నూరుశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఎస్.యాదయ్య సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శిక ఆయన పలు సూచనలు , సలహాలు అందజేశారు. గ్రామాభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని కోరారు. ఆయన వెంట మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.వెంకటేశ్వర్లు, ఎంపీపీ భూపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

మట్టపల్లిలో జెడ్పీ చైర్‌పర్సన్ పూజలు



చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మంగళవారం సూర్యాపేట జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని ఆలయ పాలకవర్గం, అర్చకులు సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించారు. శేషవస్త్రాలతో సత్కరించి స్వామివారి చిత్రపటాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పార్వతీకొండానాయక్, జెడ్పీటీసీ జగన్ నాయక్, ఎంపీడీఓ జానకిరాములు, ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ బలోపేతానికి యువత ముందుండాలి



పార్టీలో చేరిన వారికి కండువాలను కప్పుతున్న జిల్లా అధ్యక్షుడు జేవీఆర్

హుజూర్‌నగర్ (చింతలపాలెం): వైఎస్సార్ తెలంగాణ పార్టీ బలోపేతానికి యువత ముందంజలో ఉండాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ జల్లేపల్లి వెంకటేశ్వర్లు (జేవీఆర్) అన్నారు. పాలకవీడు మండలం నుంచి పలువురు యువకులు బుధవారం హుజూర్‌నగర్‌లోని ఆపార్టీ కార్యాలయంలో వైఎస్సార్ తెలంగాణ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోజురోజుకూ వైఎస్సార్‌టీపీకి ఆదరణ పెరుగుతోందన్నారు. అనంతరం పాలకవీడు మండల వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షుడిగా రమావత్ రామ్ నాయక్ నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా అధికార ప్రతినిధి సుతారి శ్రీనివాస్‌రావు, జిల్లా యువజన విభాగ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి మురళి, కామిశెట్టి రవి కుమార్, దేవరం రామకృష్ణారెడ్డి, మర్రి యశోద, మర్రి రవీందర్‌రెడ్డి, ఖలీల్‌బాబా, వేముల రాజు, వేముల లక్ష్మణ్, రాంబాబు, నాగేందర్, శ్రీను, వినోద్, విజయ్, మంజు యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ఎమ్మెల్సీ ప్రకాశ్‌ను సన్మానిస్తున్న నేతలు

మోతె: ముదిరాజ్‌ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ, ముదిరాజ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రకాశ్ తెలిపారు. బుధవారం ఖమ్మం వెళ్తూ మోతె లో కొద్ది సేపు ఆగి బీఆర్ఎస్ కార్యకర్తలతో పాటు ముదిరాజ్ సంఘం నాయకులను కలిసి మాట్లాడారు. అనంతరం స్థానిక హైదరాబాద్ స్కూల్‌లో ముదిరాజ్, బీఆర్ఎస్ కార్యకర్తలు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్‌లకు సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. ప్రకాశ్‌ను సన్మానించారు.ఈ కార్యక్రమంలో శ్రీను,గుండ్లపల్లి నాగేశ్వరరావు, ఇండ్ల వెంకన్న, ఇండ్ల కృష్ణ, నకిరకంటి మల్లయ్య, జిల్లపల్లి ముత్తయ్య, కరకయ్య పాల్గొన్నారు.

మోదం.. ఖేదం



- వ్యవసాయ రంగానికి ప్రోత్సాహంతో 4.90లక్షల మంది రైతులకు ప్రయోజనం
- వడ్డీలేని రుణాలతో 29 మహిళా సంఘాలకు లబ్ధి
- 5వేల మంది ఉద్యోగులకు కాస్త ఊరట
- ఉపాధికి నిధుల తగ్గింపు 6.32 లక్షల కూలీలపై ప్రభావం





దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లా ప్రజలకు కొంత మోదం.. కొంత ఖేదం మిగిల్చింది. కరోనా మహమ్మారితో కుదేలైన ఎంఎస్ఎంఈ(మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్)ల బలోపేతానికి కృషి చేస్తామనడం, వ్యవసాయ యాంత్రీకరణకు పోత్సాహం, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఆదాయ పన్ను పరిమితిని రూ.7లక్షలుగా ప్రకటించడం ఊరటనిచ్చింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు తగ్గించడం నిరాశే మిగిల్చింది.

వ్యవసాయంలో యాంత్రీకరణ, సాంకేతికతకు పెద్దపీట

వ్యవసాయంలో యాంత్రీకరణ, సాంకేతికత వినియోగానికి కేంద్రం పెద్దపీట వేసింది. సేద్యాన్ని స్మార్ట్ చేసేందుకు ఈ నిర్ణయాలు ఉపకరిస్తాయి. భూ రికార్డుల డిజిటలీకరణ, పురుగు మందుల పిచికారీ కోసం డ్రోన్లు ఉపయోగించడం ద్వారా రైతులకు మేలు కలుగుతుంది. చిన్న, సన్నకారు రైతులకు తక్కువ ధరలో వీటిని అందుబాటులోకి తెస్తే.. వ్యవసాయ ఖర్చులు కొంతమేరకైనా తగ్గుతాయి. వ్యవసాయ స్టార్టరప్స్‌కు చేయూత, ప్రత్యేక నిధి ఏర్పాటు జిల్లా రైతులకు ఊరట కలిగించే అంశాలే. వీటి ద్వారా జిల్లాలో 4.90 లక్షల మంది రైతులకు లబ్ధిచేకూరనుంది. సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం అందిస్తే జిల్లాలో 40 వేల మంది రైతులకు ప్రయోజనం కలుగుతుంది. తాజా బడ్జెట్‌లో రైతులకు ప్రత్యేక ప్రకటనలు ఏమీ లేకున్నా.. రూ.6 వేల సాగు సాయాన్ని కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. దీంతో జిల్లాలో 1.90 లక్షల మంది రైతులకు సంవత్సరానికి రూ.6 వేల చొప్పున అందనున్నాయి.

ఉద్యోగులపై కాస్త కరుణ

కేంద్ర బడ్జెట్ సగటు ఉద్యోగిపైనా కరుణ చూపించినట్లే కనిపిస్తోంది. గత ఫిబ్రవరి నాటి ఓటాన్‌అకౌంట్ బడ్జెట్‌లో ఆదాయ పన్ను పరిమితిని రూ.2.5 లక్షలుగా ప్రకటించింది. ఈ పరిమితిని తాజా బడ్జెట్‌లో రూ.3 లక్షలకు పెంచింది. అంతే కాకుండా రూ.3 లక్షల నుంచి రూ.6 లక్షల ఆదాయం వరకు పన్ను 10 శాతం ఉండగా ప్రస్తుతం 5 శాతానికి తగ్గించారు. దీంతో ఉద్యోగ వర్గాల్లో కొంత మేర ఆనందం వ్యక్తమవుతోంది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు రమారమి 9 వేల మంది ఉండగా, వీరిలో రూ.3 లక్షల వేతనం పొందే వారు దాదాపు 2 వేల మంది దాకా ఉంటారని అంచనా. రూ.5లక్షల వరకు ఆదాయం ఉన్న ఉద్యోగులు మరో 3 వేల మంది ఉన్నారు. ఆదాయ పన్ను పరిమితిని పెంచడంతో వీరందరికీ లబ్ధి చేకూరినట్లేనని పేర్కొంటున్నారు.

ఎంఎస్ఎంఈల బలోపేతం..

నష్టపోయిన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ)ను బలోపేతం చేయడానికి బడ్జెట్ కేటాయింపులు చేశారు. దీంతో జిల్లాలో సుమారు 20 వేల ఎంఎస్ఎంఈలకు లబ్ధిచేకూరనుంది.

మహిళా సంఘాలకు మేలు

జిల్లా వ్యాప్తంగా 29 వేల మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో సుమారు 3లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. తాజా కేంద్ర బడ్జెట్‌లో ఎస్‌హెచ్‌జీ(సెల్ఫ్‌హెల్ప్‌గ్రూప్)లకు వడ్డీలేని రుణాలను మరో ఏడాది పాటు అందిస్తామని ప్రకటించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది రుణాలు తీసుకోనున్న సంఘాల మహిళలు లబ్ధి పొందనున్నారు.

ఉపాధి కూలీలకు నిరాశ

కరోనా సమయంలో లాక్‌డౌన్ తరువాత మహానగరాల్లో ఉంటున్న కూలీలు ఉపాధి కోల్పోయారు. అధిక శాతం మంది స్వస్థలాలకు చేరుకున్నారు. వారికి ఉపాధి హామీ పథకం ఆలంబనగా నిలిచింది. గత రెండు సంవత్సరాలుగా ఉపాధి కూలీల సంఖ్య భారీగా పెరిగింది. అయితే ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులు ఉపాధి కూలీల్లో నిరాశను మిగిల్చాయి. గత బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.89 వేల కోట్లు కేటాయించగా.. ప్రస్తుతం రూ.60 వేల కోట్లు ఇచ్చారు. నిధుల తగ్గింపు జిల్లాలోని 6.32 లక్షల ఉపాధి కూలీలపై ప్రభావం చూపనుంది. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 4 లక్షల మంది కూలీలకు 60 లక్షల పని దినాలు కల్పించారు. నిధులు తగ్గడంతో పని దినాలు తగ్గి కూలీలు ఉపాధి కోల్పోయే అవకాశం ఉన్నది. ఇక కార్మికులకు ప్రత్యేక పోత్సాహకాలు అంటూ లేకపోవడంతో జిల్లా జనాభాలో సగం మేరకు ఉన్న సుమారు 5.50లక్షల మంది కార్మికులకు నిరాశ కలిగించింది.

వేతన జీవులకు ఊరట



కోదాడ: కేంద్ర బడ్జెట్ వేతన జీవులకు ఊరట కలిగించింది. ఉద్యోగులకు రూ.7 లక్షల వరకు ఎలాంటి పన్నులు లేకపోవడం, దాటిన వారికి పన్నుల స్లాబ్‌లు ఆరు కేటగిరీలుగా ఉండడం స్వాగతించాల్సిన విషయం . ప్రపంచస్థాయిలో 36 నైపుణ్య కేంద్రాలు, 150 నర్సింగ్ కళాశాలల ఏర్పాటు, ఉపాధ్యాలయు శిక్షణకు డిజిటల్ సెంటర్ల ఏర్పాటు, ప్రకృతి వ్యవసాయం, స్వదేశీ వస్తువుల ఉత్పత్తి, అమ్మకాలకు ప్రోత్సాహకాలు ప్రకటించడం, ఆశాదీపం పథకాలు స్వాగతించదగినవి. సీనియర్ సిటిజన్స్ కోసం ప్రవేశ పెట్టిన పొదుపు పథకం ఎంతో ఉపయోగపడుతుంది. విద్యావైద్య రంగాలకు తగిన నిధులు కేటాయించకపోవడం, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు బడ్జెట్ ప్రకటించకపోవడం నిరాశను కలిగించింది. రాష్ట్రాల్లో పెట్టుబడులు పెరగడానికి గ్రాంట్లు ప్రకటించడం, ఉత్పత్తులకు పెట్టుబడులకు అనుసంధానం చేయడం అభినందనీయం. దేశంలో అప్పులు తగ్గించడం, ఉత్పత్తులను పెంచడం వైపు కొన్ని ప్రయత్నాలు ఉన్నాయి.

–బడుగుల సైదులుఆర్థిక విశ్లేషకుడు, కోదాడ

ఎన్నికలు లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపులు



హుజూర్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్ ఇది. కావున ఎన్నికలు లక్ష్యంగా బడ్జెట్ కేటాయింపులు, లక్ష్యాలు ఉన్నాయి. అయితే ఆచరణలో అవి కలలుగానే మిగిలిపోయే అవకాశం ఉంది. వేతన జీవులకు ఆదాయ పన్ను పరంగా ఇచ్చిన రాయితీ నూతన పన్ను లెక్కింపు విధానం ద్వారానే కొంత మేరకు సాధ్యమవుతుంది. అయితే అది మధ్యతరగతిలో పొదుపు భావనను నిర్లక్ష్యం చేయటం ద్వారా ఆర్థిక వ్యవస్థకు పెట్టుబడుల కొరతను సృష్టిస్తుంది. ఈబడ్జెట్‌లో విద్యకు, ఆరోగ్యానికి తగినంత ప్రాధాన్యత ఇవ్వకపోవడం బాధాకరం. డిజిటలైజేషన్‌కు ఇచ్చే ప్రాధాన్యత మంచిదే అయినా ప్రజల మధ్య సాంకేతిక అంతరాలను సృష్టిస్తుంది. సేంద్రియ వ్యవసాయానికి తృణధాన్యాల పెంపకానికి ప్రోత్సాహం ఇవ్వడం శుభపరిణామం. గత అనుభవాలకు భిన్నంగా వృద్ధిరేటు లక్ష్యం 7శాతంగా నిర్ణయించడం కొంత మేర అసాధ్యం. ధరల నియంత్రణకు సరైన ప్రణాళికను రూపొందించకపోవడం శోచనీయం.

–డాక్టర్ చందా అప్పారావు, అర్థశాస్త్ర సహాయ ఆచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హుజూర్‌నగర్.

అంతా అంకెల గారడీ



భానుపురి (సూర్యాపేట) : కేంద్ర బడ్జెట్ అంతా అంకెల గారడీలా ఉంది. తెలంగాణ రాష్ట్రానికి మొండిచేయి చూపారు. సామాన్యులకు, రైతాంగానికి తీవ్ర నిరాశకు గురి చేసింది. ప్రాంతీయ పార్టీలతో రాష్ట్రానికి నష్టం తప్ప ఎలాంటి ప్రయోజనం లేదని, కేంద్రం మెడలు వంచి నిధులు తెస్తామన్న టీఆర్ఎస్ ఎంపీలు తెలంగాణకు ఎలాంటి నిధులు కేటాయించకున్నా ఏం చేస్తున్నారు.

–చెవిటి వెంకన్న, డీసీసీ అధ్యక్షుడు

ప్రజా వ్యతిరేక బడ్జెట్



ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్. ఈ బడ్జెట్‌లో సంపన్న వర్గాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. రైతాంగానికి మేలు చేసే విధంగా బడ్జెట్ కేటాయింపులు లేవు.

– మల్లు నాగార్జున రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి

ఉద్యోగులకు నిరాశే



కేంద్ర బడ్జెట్ ఉద్యోగులకు నిరాశే మిగిల్చింది. ఇన్‌కమ్ టాక్స్ స్లాబ్ రూ.5 లక్షలకు పెంచుతారని భావించినా రూ.3 లక్షలకు పరిమితం చేశారు. అయితే పన్ను శాతం తగ్గిచడం కాస్త ఊరటనిచ్చే విషయం.

– దున్నా శ్యామ్, టీఎస్‌జీఓస్ జిల్లా కార్యదర్శి

కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్.వెంకట్రావు



నూతన కలెక్టర్ వెంకట్రావుకు పూలబొకే ఇస్తున్న అదనపు కలెక్టర్ పాటిల్‌హేమంత్ కేశవ్



బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లా కలెక్టర్‌గా ఎస్. వెంకట్రావు బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్ నుంచి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ యస్. మోహన్‌రావు, జిల్లా అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు అర్చకులు మంత్రోచ్ఛరణలతో పూజలు నిర్వహించారు.

హక్కులు కల్పించకపోతే ఉద్యమం తప్పదు



గుడిసె వాసులతో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి

కోదాడరూరల్ : పేదలకు ఇళ్ల స్థలాలపై హక్కులు కల్పించకుంటే ఉద్యమిస్తామని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మిలు స్పష్టం చేశారు.బుధవారం మండల పరిధిలోని కాపుగల్లు ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలు, స్థలాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం పేదలకు ఇచ్చేందుకు ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసి పట్టాలు ఇచ్చిన తర్వాత వారికి హక్కులు కల్పించకపోవడం అన్యాయమన్నారు. ఆ స్థలాన్ని ప్రభుత్వ అవసరాలకోసం వాడుకోవడం సబబు కాదన్నారు. ప్రస్తుతం ఆ స్థలంలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న వారందరికీ హక్కులు కల్పించి డబుల్‌బెడ్ రూంలు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు ఇంటి స్థలాలు, డబుల్ బెడ్‌రూంల కోసం ఈ నెల 9న ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్‌ను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, వెలిది పద్మావతి, సోమపంగు జానయ్య, కాసాని కిషోర్, జిల్లా బోస్, రంజాన్‌బా, లక్ష్మణ్, బేబీఉన్నారు.

ప్రాధాన్యత ప్రకారం పథకాల అమలు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు



సమావేశానికి హాజరైన అధికారులు

- కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రభుత్వ ప్రాధాన్యతకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు జరగాలని, దీని కోసం అధికారులు కృషి చేయాలని జిల్లా నూతన కలెక్టర్ ఎస్. వెంకట్రావు ఆదేశించారు. బుధవారం కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత కేశవ్, యస్. మోహన్‌రావు లతో కలసి ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమానికి వైద్యాధికారులు, జిల్లా అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. దీనిని విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఇక నుంచి సోమవారం ప్రజావాణి, మంగళవారం ధరణి, భూసమస్యలు, బుధవారం ఆకస్మిక తనిఖీలు, పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలు సమావేశాలు, మండల అధికారులతో సమావేశాలు, గురువారం అభివృద్ధి, సంక్షేమ పథకాల పరిశీలన ,ల్యాండ్ ఎక్వజేషన్ పై సమావేశం, శుక్రవారం వాటరింగ్‌డే, ఉపాధి హామీ పనుల పరిశీలన, శనివారం రెవెన్యూ కోర్టు నిర్వహణ ఉంటుందని ఆయన వివరించారు. ప్రతి నెలలో రెండు రోజులు అర్బన్‌డే ఉంటుందని తెలిపారు. ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలని, ప్రజావాణి ఆన్ లైన్,ఆఫ్ లైన్ కార్యక్రమాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. అలాగే వెబెక్స్ ద్వారా అధికారులతో రివ్యూలు నిర్వహిస్తానని తెలిపారు. అధికారులు తమ సెల్ ఫోన్ ద్వారా ఎక్కడినుంచైనా ఈ రివ్యూ సమావేశంలో పాల్గొనవచ్చని ఆయన సూచించారు. గురువారం సాయంత్రం 5 గంటలకు తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్‌లతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, కిషోర్ కుమార్, వెంకారెడ్డి, జిల్లా పరిషత్ సీఈఓ సురేష్, డీఆర్‌డీఓ కిరణ్ కుమార్, సీపీఓ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, డీఎఫ్ఓ సతీష్ కుమార్, సంక్షేమ అధికారి జ్యోతి పద్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.117 కోట్లతో పాఠశాలల అభివృద్ధి

- విద్యారంగంపై కేసీఆర్‌కు ఉన్న ప్రేమకు నిదర్శనమే మన ఊరు–మనబడి
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి
- చివ్వెంలలో మన ఊరు మన బడి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం



చివ్వెంల ప్రాథమిక పాఠశాలలో మన ఊరు మనబడి అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

చివ్వెంల(సూర్యాపేట) : జిల్లాలో మన ఊరు మన బడి కార్యక్రమం కింద రూ.117 కోట్లతో పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి తెలిపారు. చివ్వెంల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో రూ.18 లక్షల వ్యయంతో చేసిన మన ఊరు–మన బడి అభివృద్ధి పనులతో పాటు, రూ.80లక్షలతో నిర్మించిన నూతన పశువైద్యశాల ప్రారంభోత్సవం , సీసీరోడ్లు, గ్రామ పంచాయతీ కార్యాలయం నూతన భవనానికి శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యారంగంపై కేసీఆర్‌కు ఉన్న ప్రేమే మన ఊరు–మనబడి అని పేర్కొన్నారు. విద్యార్థుల చదువులతో పాటు, ఉపాధ్యాయులు బోధించడానికి అన్ని వసతులు ఉండాలనే లక్ష్యంతో పాఠశాలల్లో ఆహ్లాద కరవాతావరణం ఉంటేనే చదువులు సరైన రీతిలో కొనసాగుతాయని రూ.7,289కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా మన ఊరు మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. సర్కారు విద్య వద్దు అన్న రోజులు పోయి, సర్కారు విద్య కావాలనే రోజులు వచ్చాయన్నారు. ప్రభుత్వ గురుకులాల్లో అడ్మిషన్ కోసం పోటీ పెరుగుతోందన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం వెయ్యి గురుకులాలు ఉన్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. తెలంగాణ వచ్చిన 8 సంవత్సరాల కాలంలో 75 యేళ్ల స్వాతంత్ర్య భారత దేశంలో జరగని అభివృద్ధి అయ్యిందన్నారు. వ్యవసాయం, సాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం, పరిశ్రమలు, వాణిజ్య రంగాల్లో వేలు పెట్టి చూపే పరిస్థితి లేదన్నారు. విద్యార్థులతో మమేకమై పుస్తకాలు, నోట్స్‌పరిశీలించి వారినికొన్ని ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకట్ నారాయణ, మండల అధ్యక్షుడు జూలకంటి జీవన్‌రెడ్డి, ఎంపీపీ ధరావతు కుమారి బాబు నాయక్, జెడ్పీటీసీ భుక్యా సంజీవ్ నాయక్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జూలకంటి సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ పార్వతమ్మ, పీఏసీఎస్ చైర్మన్ మారినేని సుధీర్‌రావు, నర్సింహారావు పాల్గొన్నారు.



విద్యార్థినితో పాఠం చదివిస్తున్న మంత్రి

మనబడి బాగుపడే..



శిథిలావస్థలో ఉన్న చెవ్వెంల ప్రాథమిక పాఠశాల







మన ఊరు మనబడి కింద కార్పొరేటుకు దీటుగా మారిన చివ్వెంల ప్రాథమిక పాఠశాల, ఏర్పాటు చేసిన డ్యూయల్ డెస్క్‌లు, నిర్మించిన మరుగుదొడ్లు, వంటగది

క్లుప్తంగా

యాదాద్రి ఇన్‌చార్జ్ ఈఓగా రామకృష్ణారావు



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ఇన్‌చార్జ్ ఈఓగా దేవాదాయశాఖ ఆర్‌జేసీ రామకృష్ణారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆలయ ఈఓగా విధులు నిర్వహిస్తున్న ఈఓ గీతారెడ్డి ఈ నెల 18వ తేదీ వరకు సెలవుల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో క్షేత్రానికి ఇన్‌చార్జ్ ఈఓగా రామకృష్ణారావు వచ్చారు. గతేడాది పలుమార్లు ఈఓ గీతారెడ్డి సెలవుల్లో ఉన్నప్పుడు కూడా రామకృష్ణరావు ఇన్‌చార్జ్ ఈఓగా వ్యవహరించారు. బుధవారం జరిగిన ఆర్టీసీ బస్టాండ్ ప్రారంభోత్సవం, పాతగుట్ట ఆలయ బ్రహ్మోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్యులు ఆయనకు ఆశీర్వచనం చేశారు.

మతోన్మాదులకు గుణపాఠం చెప్పాలి



పార్టీ కార్యాలయానికి శంకుస్థాపన చేస్తున్న సీతారాములు

తుర్కపల్లి: మతోన్మాదులకు ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయం శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మోదీ ప్రధాని కాకముందు మామూలు వ్యాపారిగా ఉన్న గౌతమ్ అదానీ కుబేరుడిగా మారాడాని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలు మరింత పేదలుగా మారిపోయారని ఆవేదనవ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మహ్మద్ జహంగీర్, కల్లూరి మల్లేశం, పోతరాజు జహంగీర్, లింగయ్య, రాజు, మాతయ్య, దార్ల దుర్గయ్య, కళమ్మ, వెంకటేశం, నాగరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో వ్యక్తి మృతి

నల్లగొండ క్రైం : అనారోగ్య కారణాలతో నల్లగొండని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం ఓ వ్యక్తి మృతిచెందాడు. తిప్పర్తి మండలం నూకలవారిగూడేనికి చెందిన నూకల పరమేష్(44) పెద్దవూరలో ఉన్న సోదరి వద్దకు వెళ్లేందుకు తిప్పర్తిలో బస్సు ఎక్కాడు. నల్లగొండ బస్టాండ్‌కు చేరుకున్న తర్వాత పరమేష్ పెద్దవూర వైపు వెళ్లే బస్సు ఎక్కేందుకు ఎదురుచూస్తున్న క్రమంలో అకస్మాత్తుగా ఫిట్స్, గుండెపోటు రావడంతో అక్కడే కుప్పకూలి మృతిచెందాడు. మృతుడి సోదరుడు లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ ఎస్సై రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

రేపు డైట్‌లో సర్టిఫికెట్ల పరిశీలన

నల్లగొండ : డీఈఈ సెట్ 2022 అర్హత సాధించిన డీఈఐఈడీ , డీపీఎస్ఈ రెండేళ్ల కోర్సుకు సంబంధించి నల్లగొండ డైట్ కళాశాలలో శుక్రవారం మూడో విడత సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ నర్సింహ ఒక ప్రకటనలో తెలిపారు. 3న సర్టిఫికెట్ల పరిశీలన, అర్హులైన వారు 6 నుంచి 9వ తేదీలోపు ఆప్షన్లు ఎంచుకోవాలని , 14న సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.

భక్తుల సౌకర్యాల కల్పనకు కృషి



బస్టాండ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డిగోవర్ధన్, చిత్రంలో ప్రభుత్వ విప్ సునీత, జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, గొంగిడి మహేందర్‌రెడ్డి

- దేశమంతా కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటోంది
- మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- యాదగిరిగుట్టలో బస్‌స్టేషన్ ప్రారంభం



బస్టాండ్‌ను ప్రారంభిస్తూ రిబ్బన్ కట్‌చేస్తున్న మంత్రి, ప్రభుత్వ విప్, ఆర్టీసీ చైర్మన్ గోవర్ధన్

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు సీఎం కేసీఆర్ చేస్తున్నారని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. యాదాద్రి కొండకు దిగువన గండి చెరువు సమీపంలో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను ఆ సంస్థ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదాద్రి క్షేత్రానికి వచ్చే భక్తులకు ప్రయాణ సౌకర్యాలు కల్పించేందుకు 5 ఎకరాల స్థలంలో సుమారు రూ.7కోట్ల వ్యయంతో సువిశాలమైన స్థలంలో బస్టాండ్ నిర్మాణం జరిగిందన్నారు. సీఎం కేసీఆర్ దేశంలో అద్భుతమైన ఆలయంగా యాదాద్రిని పునః నిర్మాణం చేశారన్నారు. ప్రస్తుతం యాదాద్రి క్షేత్రానికి 20వేలకుపైగా, శని, ఆదివారాల్లో 35వేలకు పైగా భక్తులు వస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో లక్షకు పైగా భక్తులు ఈ క్షేత్రానికి వచ్చి స్వామిని దర్శించుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో దేశమంతా మన రాష్ట్రం వైపు చూస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏ రాష్ట్రం అభివృద్ధి కాలేదని విమర్శించారు. కానీ సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో తెలంగాణను తక్కువ సమయంలోనే గొప్ప అభివృద్ధి చేశారని, దీంతో ప్రస్తుతం దేశ ప్రజలంతా కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, ఆర్టీసీ ఈడీ పురుషోత్తం నాయక్, ఆర్‌ఎం శ్రీదేవి, జాయింట్ కలెక్టర్ దీపక్ తివారీ, ఇన్‌చార్జ్ ఈఓ రామకృష్ణారావు, ఆర్డీఓ భూపాల్‌రెడ్డి, డిపో మేనేజర్ శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, జెడ్పీటీసీ తోటకూరి అనురాధ తదితరులున్నారు.

జలప్రసాదం ప్రారంభం

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రానికి వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ బస్టాండ్‌లో నూతనంగా దివీస్ లాబోరేటరీస్ లిమిటెడ్ యాజమాన్యం ఏర్పాటు చేసిన జల ప్రసాదం (ఆర్వో వాటర్ ప్లాంట్)ను ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ప్రభుత్వ విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. అంతకు ముందు ఆర్టీసీ ఈడీ పురుషోత్తంతో కలిసి చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



జలప్రసాదాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్ గోవర్ధన్

ధ్వజారోహణం.. దేవతాహ్వానం



పాతగుట్ట ఆలయ వీధుల్లో స్వామివారి ఊరేగింపు

- పాతగుట్టలో రెండో రోజుకు చేరిన బ్రహ్మోత్సవాలు
- నేడు అలంకార సేవ.. ఎదుర్కోలు మహోత్సవం



భేరీ పూజ నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం విశేష పర్వాలు జరిగాయి. ఉత్సవ విశిష్టతను లోకమంతా చాటి, సకల దేవతలను ఆహ్వానించే తతంగాన్ని ఆచార్యులు నిర్వహించారు. అంకురార్పణ తదుపరి నిర్వహించే వేడుక ధ్వజారోహణం. భగవానుడి వాహనం అయిన గరుడ ఆళ్వారును కొత్త వస్త్రంపై చిత్రించి పూజాధికములు నిర్వహించి, గరుడ ఆళ్వారుడికి ప్రత్యేక ఆరాధన చేశారు. ఊరేగింపుగా ధ్వజ పటాన్ని ధ్వజ స్తంభం వరకు తీసుకెళ్లారు. అక్కడ గరుడ ఆళ్వారుడికి ఇష్టమైన పదార్థాలను (గరుడ ముద్దలను) నైవేద్యంగా సమర్పించారు. గరుడస్వామికి ఇష్టమైన వంటకాల సమర్పణలో అష్టరాగాల ఆలాపన చేసి, ధ్వజారోహణం నిర్వహించారు. ఈ కార్యక్రమంతో ఉత్సవ వైభవం విశ్వజనులకు చేరిందని ఆచార్యులు చెప్పారు. గరుత్మంతుడికి సమర్పించిన నైవేద్యం ప్రసాదాలను ఆచార్యులు భక్తులు, నిర్వాహకులకు అందజేశారు. ధ్వజారోహణం దర్శించిన భక్తులకు పాపవిమోచనం, విష్ణులోక ప్రాప్తి, మనోరథసిద్ధి వంశావృద్ధి, సమాజ శ్రేయస్సు తదితర విశేష ఫలితాలు కలుగుతాయని ఆచార్యులు తెలిపారు. ఈ వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ రామకృష్ణారావు, ఆచార్యులు, అధికారులు పాల్గొన్నారు.

సాయంకాలం...

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిత్యారాధనల అనంతరం వేదపారాయణికులచే వేదపారాయణం, మూలమంత్ర, అనుష్టానముల గావించారు. అనంతరం సాయంత్రం బేరీపూజ, దేవతాహ్వానం ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, యజ్ఞాచార్య బృందం, అర్చకులు, పారాయణికులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

భేరీ పూజ.. దేవతాహ్వానం..

శబ్దం భగవంతుని స్వరూపం కనుక శబ్దనాములతో భగవానుని ఆరాధించుట ఈ వేడుకలోని ప్రత్యేక అని ఆచార్యులు పేర్కొన్నారు. ఆయా రాగ, తాళ, వాయిద్యములతో వేద మంత్ర ఉచ్ఛారణలతో బ్రహ్మాది దేవతలను ఆహ్వానించి ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహించుటే ఈ దేవతాహ్వానం వేడుకని ఆచార్యులు వెల్లడించారు.

నేడు అలంకార సేవ.. ఎదుర్కోలు

నృసింహుడికి ఇష్టమైన అలంకార సేవలు గురువారం ప్రారంభం కానున్నాయి. స్వామివారిని ఉదయం హవన పూజలు జరిపించిన తరువాత సింహ వాహనంపై అలంకారం చేసి తిరువీధుల్లో సేవ నిర్వహిస్తారు. ఇక రాత్రి శ్రీస్వామి వారి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అశ్వవాహనంపై ఊరేగుతూ తిరువీధుల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

చెర్వుగట్టులో వైభవంగా దోపోత్సవం



దోపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



హోమం పూజల్లో పాల్గొన్న ఈఓ తదితరులు

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలో గల శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున వైభవంగా దోపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామలింగేశ్వర శర్మ, సురేష్, సతీష్, శ్రీకాంత్‌శర్మ, అర్చక బృందం ఆధ్వర్యంలో వేదమంత్రాలతో దోపోత్సవం, మహా బలిహరణ, మహా పూర్ణాహుతి, ధ్వజారోహణం, ఏకాదశ రుద్రభిషేకం, జ్యోతి లింగార్చన, ఏకాంత సేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక అధికారి నవీన్‌కుమార్ సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి, శంకర్, శ్రీనివాసరెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజయ్య, వెంకటయ్య, వంశీధర్‌రావు, రాజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'గుట్ట' మున్సిపల్ అవిశ్వాసంపై హైకోర్టు స్టే..



మున్సిపల్ చైర్‌పర్సన్ సుధాకు స్వీట్ తినిపిస్తున్న కోఆప్షన్ సభ్యురాలు పద్మ

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టవద్దంటూ హైకోర్టు స్టే ఇచ్చింది. ఈ విషయాన్ని చైర్‌పర్సన్ సుధా హేమేందర్‌గౌడ్ బుధవారం తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ సుధా హేమేందర్‌గౌడ్‌పై గత నెల 30 తేదీన 5వ వార్డు కౌన్సిలర్ గుండ్లపల్లి వాణి భరత్‌గౌడ్ ఆధ్వర్యంలో పది మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి అందజేశారు. ఈ నేపథ్యంలో చైర్ పర్సన్ సుధా హైకోర్టును ఆశ్రయించారు. పిటీషన్‌ను పరిశీలించిన హైకోర్టు.. అవిశ్వాస పెట్టవదని స్టే ఇచ్చినట్లు సుధా తెలిపారు. ఇందుకు సంబంధించిన స్టే ఆర్డర్ కాపీ గురువారం అందనున్నట్లు చెప్పారు.

చైర్‌పర్సన్ మద్దతుదారుల సంబురాలు

మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్ గౌడ్‌కు అనుకూలంగా హైకోర్టులో స్టే వచ్చిందని పట్టణ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు సంబరాలు చేసుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌కు మిఠాయి తినిపించి సన్మానం చేశారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు గోర్ల పద్మ, పేరబోయిన పెంటయ్య, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు పెలిమెల్లి శ్రీధర్‌గౌడ్, నాయకులు కీసరి బాలరాజు, గుండపల్లి లింగం, ఆరె శ్రీధర్, శివరాత్రి మహేష్, సయ్యద్ బాబా, గుండ్లపల్లి శ్రీరామ్‌గౌడ్, చంద్రం, రజనీకాంత్ ఉన్నారు.

పేలుడు పదార్థం తిన్న ఆవు

- నోట్లో పేలడంతో మృతి

రాజాపేట : పేలుడు పదార్థం తిని ఓ ఆవు మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని రామచంద్రగూడెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు బక్కెన శివుడు వ్యవసాయ పొలం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు అడవిపందుల కోసం ఆహారంలో పేలుడు పదార్థం పెట్టారు. దానిని ఆవు వెళ్లి తినడంతో నోటిలో పేలి మృతిచెందింది. సుమారు రూ. 40వేలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు శివుడు ఆవేదనవ్యక్తం చేశాడు.

బయో ఆర్గానిక్‌పై విద్యార్థుల ప్రదర్శన

గరిడేపల్లి : గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా లయోలా కళాశాలకు చెందిన విద్యార్థులు గరిడేపల్లిలోని రైతుల పొలాల్లో బయో ఆర్గానిక్ సముద్ర కలుపుసారంపై బుధవారం ప్రదర్శన నిర్వహించారు. బయో ఆర్గానిక్ మొక్కల పెరుగుదలకు ఉపయోగించబడుతుందని పేర్కొన్నారు. సహజ సిద్ధమైన పదార్థాలతో తయారు చేసిన జీవ ఉత్తేజకమని తెలిపారు. ఇది సముద్రపు మొక్కల నుంచి తయారు చేయబడి పంటలలో నాణ్యమైన అధిక దిగుబడులిచ్చే సేంద్రియ పదార్థాల నిధి అని తెలిపారు. దీనిని ఉపయోగించిన పంటలు క్లిష్టమైన వాతావరణ పరిస్థితులు నుంచి రక్షణ పొంది, పూలు, పండ్లు, రాలిపోవుటను నివారిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శాస్త్రవేత్త లవకుమార్, మానస, జ్ఞానసిరి, శ్రీనిధి, ఆకర్షరెడ్డి, హారిక, అఖిల, కాట సింధు ప్రియ ఉన్నారు.

ముగిసిన ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ

- బదిలీల కోసం 2,414 మంది దరఖాస్తులు
- ప్రమోషన్ల ధ్రువపత్రాల పరిశీలన

సూర్యాపేటటౌన్ : ఉపాధ్యాయుల ఆన్‌లైన్ బదిలీల ప్రక్రియ బుధవారంతో ముగిసింది. గత నెల 28వ తేదీ నుంచి ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. అయితే 30వ తేదీ వరకు దరఖాస్తులకు చివరి తేదీ ప్రకటించగా మళ్లీ రెండు రోజులు గడువు పెంచడంతో ఉపాధ్యాయులకు అవకాశం లభించింది. ఈ నెల 30వ తేదీ వరకు 2200 మంది ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోగా ఈ రెండు రోజుల్లో 214 మంది వరకు అప్లయ్ చేసుకున్నారు. మొత్తం 2,414 మంది ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. మొత్తానికి ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది.

తప్పిదాలకు ఎడిట్ ఆప్షన్...

దరఖాస్తు చేసుకున్న వాటిలో ఏమైనా తప్పిదాలు జరిగినా, సర్టిఫికెట్‌లు అప్‌లోడ్ చేయకున్నా వాటిని తిరిగి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకునేందుకు విద్యాశాఖ ఎడిట్ ఆప్షన్ ఇచ్చింది. దీంతో బుధవారం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల్లో కొందరు ఈ అవకాశాన్ని వినియోగించుకొని సరిచేసుకోనున్నారు. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. వాటికి సంబంధించిన అన్ని పత్రాల జాబితాను సంబంధిత కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఎంఈఓల ద్వారా డీఈఓ కార్యాలయానికి పంపించాల్సి ఉంటుంది. వాటన్నింటినీ పరిశీలించి అవన్నీ సక్రమంగా ఉన్నాయా.. లేవా అనేది పరిశీలించిన తర్వాత ఈ నెల 7న ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను విడుదల చేయనున్నారు.

ధ్రువపత్రాల పరిశీలన..

ప్రమోషన్‌ల కోసం దరఖాస్తులు చేసుకున్న ఉపాధ్యాయుల ధ్రువపత్రాలను బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మరోసారి పరిశీలన చేశారు. హుజూర్‌నగర్, సూర్యాపేట నియోజకవర్గాల పరిధిలోని ఉపాధ్యాయుల పత్రాలను కాంప్లెక్స్ హెచ్‌ఎంలచే పరిశీలన చేయించారు.

పెద్దగట్టు జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి



జాతర పనులు పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

చివ్వెంల(సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్దదైన శ్రీలింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతర ఈనెల 5 నుంచి తొమ్మిది వరకు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తెలిపారు. బుధవారం దురాజ్‌పల్లి గ్రామ శివారులోని లింగమంతుల స్వామి ఆలయాన్ని పరిశీలించారు.స్నానాల గదులు, కోనేరు పనులు, మంచినీటి కోసం వాటర్ ట్యాంకు, పార్కింగ్ కోసం స్థల సేకరణ పనులను పరిశీలించి మాట్లాడారు. జాతర అభివృద్ధికి రూ.6.50 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసియాలోనే అతిపెద్దదిగా చెప్పుకునే ఈ జాతరకు రాష్ట్రం నుంచే కాకుండా దేశ వ్యాప్తంగా ఇతర రాష్ట్రాల నుంచి 20 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పరంగా ఇప్పటికే కోట్ల రూపాయలు కేటాయించి పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీరు, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలపై అధికారులు దృష్టి సారించే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కేశారం గ్రామానికి చెందిన మెంతబోయిన వంశస్తుల కోసం ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై అక్కడికి వచ్చిన భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, పెద్దగట్టు చైర్మన్ కోడి సైదులు యాదవ్, గ్రంథాలయ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, పెన్‌పహాడ్ ఎంపీపీ నెమ్మాది భిక్షం, జెడ్పీటీజీ భుక్యా సంజీవ్ నాయక్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జూలకంటి జీవన్ రెడ్డి, నాయకులు జటంగి వెంకటేశ్వర్లు యాదవ్, కాసం శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న కమలానందభారతీ స్వామి



స్వామివారి సన్నిధిలో కమలానంద భారతీ స్వామి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని భువనేశ్వరి పీఠాధిపతులు కమలానంద భారతీ స్వామిజీ బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ హిందూ దేవాలయాల పరిరక్షణ, గో సంరక్షణ, ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ, సనాతన ధర్మ రక్షణకై బాసర నుంచి కర్ణాటక రాష్ట్రంలోని హంపి విజయనగరం వరకు పదివేల కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కమాలనంద భారతీ స్వామిజీ వెంట శ్రీతీర్ధ పీఠాధిపతులు వివేకానంద స్వామిజీ, హిందూ దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కట్టిగొమ్ముల రవీందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, వరుణ్‌రెడ్డి తదితరులున్నారు.

అత్తింటి ఎదుట వివాహిత ఆందోళన

సూర్యాపేట క్రైం : న్యాయం చేయాలంటూ అత్తింటి ఎదుట ఓ వివాహిత ఆందోళనకు దిగింది. ఈ ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు..నకిరేకల్‌కు చెందిన షేక్ లతీఫ్, జుబేదా కుమార్తె షేక్ నిష్మాకు పెద్దల సమక్షంలో స్థానిక మార్కెట్ వద్ద నివాసం ఉంటున్న షేక్ మౌలానాతో 2013లో వివాహం జరిగింది. పది సంవత్సరాల నుంచి భర్త అత్త,మామ, ఆడపడుచులు తనను వేధిస్తున్నారని షేక్ నిష్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో తన భర్త ఖమ్మం జిల్లాకు చెందిన హుస్సేన్ బినిని వివాహం చేసుకొని హైదరాబాదులో కాపురం పెట్టారని తెలిపింది. రెండో వివాహం చేసుకున్న తన భర్తపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని బాధితురాలు కలెక్టర్, ఎస్పీకి విజ్ఞప్తి చేసింది. ఆమె వెంట తల్లిదండ్రులు, సోదరుడు, కుటుంబ సభ్యులు, జన జాగృతి మహిళా సంఘం గోపమ్మ, సైదాబీ, నాగమణి పాల్గొన్నారు.

టి వ్యాలెట్ వినియోగంపై అవగాహన

ఎంజీయూ(నల్లగొండ రూరల్) : ఉపకార వేతనాలు పొందే విద్యార్థులు టి వ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని యూనివర్సిటీ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ అంజిరెడ్డి సూచించారు. బుధవారం యూనివర్సిటీలో నిర్వహించిన టి వ్యాలెట్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రవి, శేఖర్ రెడ్డి, కృష్ణ, ఫణి, మురళి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సీనియర్ నాయకుడు 'మందడి' హఠాన్మరణం

- నివాళులర్పించిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని, నేతలు చాడ, పల్లా



చండూరు : సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు, చండూరు వైస్ ఎంపీపీ మందడి నర్సింహారెడ్డి(57) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన చండూరు మండలం పుల్లెంలలోని స్వగృహంలో ఉండగా తెల్లవారుజామున కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే నర్సింహారెడ్డిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ 9గంటలకు తుదిశ్వాస విడిచారు. నర్సింహారెడ్డికి భార్య, కూతురు ఉన్నారు. ఈయన 1984లో యువజన సంఘం (సీపీఐ అనుబంధం)లో చేరి యువజనుల హక్కుల కోసం పోరాటం చేశారు. 1993లో పార్టీ చండూరు కార్యదర్శిగా ఎన్నికై 2008 వరకు 15ఏళ్ల పాటు కొనసాగారు. అనంతరం జిల్లా కార్యవర్గ, రాష్ట్ర సమితి సభ్యుడిగా పనిచేశారు.

రెండు పర్యాయాలు వైస్ ఎంపీపీగా...

నర్సింహారెడ్డి 2000 నుంచి 2005 వరకు చండూరు మండల వైస్ ఎంపీపీగా, 2019లో రెండో సారి ఎంపీటీసీగా ఎన్నికై తిరిగి వైస్ ఎంపీపీగా బాధ్యతలు చేపట్టి కొనసాగుతున్నారు.

నర్సింహారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

చండూరు వైస్ ఎంపీపీ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మందడి నర్సింహారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మండలంలోని పుల్లెంల గ్రామంలో నర్సింహారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మందడి మృతి తనను ఎంతగానో బాధించిందని కన్నీటిపర్యంతమయ్యారు. అంతకుముందు పార్టీ కార్యకర్తల సందర్శనార్థం మందడి మృతహాన్ని చండూరు సీపీఐ కార్యాలయంలో ఉంచగా పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ కిషన్‌రెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, సీపీఐ, సీపీఎ జిల్లా కార్యదర్శులు నెల్లికంటి సత్యం, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, నలపరాజు సతీష్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. కొండాపురంలో కూడా పార్టీ గ్రామ కమిటీ సంతాపం ప్రకటించింది. కార్యక్రమంలో నాయకులు రత్నాకర్‌రావు. బచ్చనబోయిన గాలయ్య, పగిళ్ల శేఖర్, సంజీవ ఉన్నారు.



హైదరాబాద్‌లో నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి తదితరులు



నర్సింహారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని తదితరులు



చండూరు సీపీఐ కార్యాలయంలో మందడి మృతదేహంపై ఎర్ర జెండా కప్పుతున్న నాయకులు

అదే విధంగా ఎంపీడీఓ కార్యాలయంలో కూడా నర్సింహారెడ్డి చిత్రపటానికి ఉద్యోగులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యాకూబ్ నాయక్, టీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పల్లె రవికుమార్, ఎంపీటీసీలు పల్లె వెంకన్న, గొరిగె సత్తయ్య, కావలి మంగమ్మ, ఏఈ రమేష్, తదితరులు ఉన్నారు.